క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో మంగళవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ పీఆర్‌ఓ పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం 'స్టూడెంట్ లీడ్ మూవ్‌మెంట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో భారీ ర్యాలీ తీశారు. రోడ్డు భద్రత, అడవుల పెంపకం, ప్లాస్టిక్ వాడకం, కాలుష్యం, దోమల నివారణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ, ప్రిన్సిపాల్ జైసన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఎనిమిది అర్జీలు



రోడ్డుకు మరమ్మతు చేయాలని ఆర్డీఓకు అర్జీ అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి ఎనిమిది అర్జీలు అందాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. రాయపోల్ నుంచి పాల్కంపల్లి వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి అస్తవ్యస్తంగా ఉందని, ఆ రోడ్డుకు మరమ్మతు చేయించాలని ఒక దరఖాస్తు, భూ సమస్యలపై మూడు, పింఛన్ల కోసం రెండు, స్కాలర్‌షిప్ కోసం ఒకటి, ఇతర సమస్యపై మరొకటి వచ్చిందని వెల్లడించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

'మోక్షగుండం' నేటితరానికి స్ఫూర్తి



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేటితరం ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత అని ఆదిబట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వరకాల పరమేష్ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రతిభావంతుడైన విశ్వేశ్వరయ్య.. దూరదృష్టితో ఎన్నో నిర్మాణాలు జాతికి అంకితం చేశారని కొనియాడారు. ఆధునిక భారతదేశానికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. ఆయన పుట్టిన రోజును ఇంజినీరింగ్ డేగా జరుపుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, భారతి పాల్గొన్నారు.

కళాశాలల బంద్ విజయవంతం



నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు, అధ్యాపక బృందం

ఆమనగల్లు: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాలను మూసి వేశారు. యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు. ఇందులో ప్రిన్సిపాల్ చందు, యాజమాన్యం చెన్నయ్య, శివలింగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

మహేశ్వరం: బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని ప్రాచీనకాలం బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ కమిటీ ఈఓ మురళీకృష్ణ, జిల్లెల్లగూడ ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో పాలక మండలి చైర్మన్ కల్లెం నరేశ్ గౌడ్ సమక్షంలో ఆరు నెలలకు సంబంధించి లెక్కింపు చేపట్టారు. రూ.1,10,597 కానుకలు వచ్చాయని అధికారులు తెలిపారు.

పల్లెల్లో 'భగీరథ' కష్టాలు



జాపాల గ్రామంలో నీటిశుద్ధి కేంద్రం వద్ద క్యూలో క్యాన్లు

తాగునీటి సరఫరాలో అంతరాయం
- ఐదు రోజులుగా గ్రామాల్లో కటకట
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ట్యాంకర్ల ద్వారా కొనుగోలు
- నీటిశుద్ధి కేంద్రానికి పరుగు

మంచాల: ఓ వైపు విస్తృతంగా వర్షాలు కురుస్తున్నా.. మరోవైపు మండల పరిధి గ్రామాల్లో 'భగీరథ' కష్టాలు మొదలయ్యాయి. సాంకేతిక సమస్యలతో మిషన్ భగరథ నీరు సరఫరా నిలిపివేతతో బాధిత గ్రామాల ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొందరు క్యాన్లతో నీటిశుద్ధి కేంద్రాలకు పరుగు తీస్తుండగా.. ఇంకొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. మండల పరిధి ఒకటిరెండు గ్రామాలు మినహా.. మిగతా ప్రాంతాల్లో ఇదే సమస్య ఉత్పన్నమయింది.

వాల్వ్, పైప్‌లైన్ లీకేజీలు

జాపాల గ్రామంలో ఒక్కటి స్కీం బోర్ ఉంది. అది కూడా చాలీ చాలని నీటిని అందిస్తోంది. దాని ఆధారంగానే గ్రామంలో నీటి శుద్ధి కేంద్రం కొనసాగుతోంది. అస్మత్‌పూర్‌లో ఇదే పరిస్థితి. కాగజ్‌ఘట్‌లో స్కీం బోరు ఉంది. కానీ నీటి సరఫరా చేసే పైపులకు కనెక్షన్ ఇవ్వాలి. ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.4 లక్షలు మంజూరయ్యాయి. ఇంకా పనులు పూర్తి కాలేదు. మంచాల గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. అంతే కాకుండా పలు గ్రామాల్లోని ట్యాంక్‌ల వద్ద గేట్ వాల్వ్, పైప్‌లైన్ లీకేజీ సమస్యలు ఉన్నాయి. దీంతో 3 గంటల వ్యవధిలో నిండాల్సిన ట్యాంకులు.. 6 గంటల సమయం తీసుకుంటోందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

తాగునీటి సమస్య ఉందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని నీటితో ఇబ్బంది పడుతున్నామని, ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా మండల పరిధి 23 గ్రామాల్లో 138 స్కీం బోర్లు ఉన్నాయని, అందులో 132 పని చేస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి పావని పేర్కొన్నారు.

> **సమాచారం ఇచ్చాం**
>
> మండల పరిధి గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేత గురించి ప్రజలకు, ఆర్ డబ్ల్యూఎస్ (రూరల్ డెవలప్‌మెంట్ వాటర్ సప్లయ్) అధికారికి ముందస్తుగా సమాచారం అందించాం. నీటి సమస్య తలెత్తకుండా ఏడాది కాలంగా ప్రత్యామ్నాయంగా స్కీం బోర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించాం.
>
> – ప్రవీణ్, ఏఈ, మిషన్ భగీరథ

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



మాడ్గుల: నాగిళ్లలో జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

మాడ్గుల: గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి నాగిళ్ల గ్రామం ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. గురువు, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. అవురుపల్లిలో నిర్మించ తలపెట్టిన కాటమయ్య దేవాలయంలో బోరు మోటార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చైర్మన్ సాయిరెడ్డి, తహసీల్దార్ వినయ్ సాగర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేజన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండుగౌడ్, నాయకులు సూదిని శ్రీనివాస్ రెడ్డి, కొండల్‌రెడ్డి, మహ్మద్ బాబా, రాములు, జంగయ్య, జగన్ గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మండల పరిధి నాగిళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గ్రామ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శిథిల ప్రభుత్వ భవనాలను కూల్చి, అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. నాగిళ్ల, అప్పరెడ్డిపల్లి, చరికొండ, దొడ్లపాహడు గ్రామాలకు బీటీ రోడ్లు వేయించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్, నాయకులు నర్సింహ్మా, లింగం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరు అయిన చెక్కులను.. బాధితులకు సోమవారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాములు, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మెకానిక్ బాబా, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ కార్యదర్శి

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నెలనెలా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో 65 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందిని ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి కంటి దవాఖానకు పంపించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ మైమునాబేగం, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, క్లబ్ పీఆర్‌ఓ పాషా, సభ్యులు కొండల్‌రెడ్డి, పాండు, జహంగీర్ అలీ, మహేశ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం

కడ్తాల్: పంట పొలాల మీదుగా తీస్తున్న 765 కేవీ హైటెన్షన్ బీదర్– మహేశ్వరం అలైన్‌మెంట్‌ను మార్చే వరకు పోరాటం చేస్తామని బాధిత రైతులు స్పష్టం చేశారు. అలైన్‌మెంట్ ఆపాలని డిమాండ్ చేస్తూ.. వారు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొద్దిపాటి స్థలంలో సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అలాంటి తమ పొలాల మీదుగా విద్యుత్ లైన్ తీస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు ఉద్యమ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్, పెంటారెడ్డి, శ్రీరాములు, మహేశ్, అభిషేక్‌రెడ్డి, రాములుయాదవ్, రాజేందర్‌యాదవ్, రమేశ్, వెంకటయ్య, కృష్ణ, వెంకటేశ్, మల్లయ్య, నరేశ్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

కందుకూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

స్నేహితుడి చికిత్సకు ఆర్థిక సహాయం



యాచారం: బాధితుడి కుటుంబానికి నగదు అందజేసిన మిత్రబృందం

యాచారం: ఆపదలో ఉన్న మిత్రుడికి బాల్య స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల 1999– 20లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన సురిగి యాదయ్య.. రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కావడంతో చికిత్స నిమిత్తం యాదయ్య భార్య స్వాతికి రూ.1.75 లక్షలు అందజేశారు. వైద్య ఖర్చుల కోసం మరింత ఆర్థిక సహాయం చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సుధాకర్, అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బొజ్జయ్య, కొండల్‌రెడ్డి, రాజు, ప్రభాకార్, కిరణ్‌కుమార్, యాదగిరిగౌడ్, ముత్యాలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల: ఆరుట్లలో..

మంచాలలో..

మంచాల: ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన నూకం జంగయ్య(44) కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. మృతుడితో ఆరుట్ల పాఠశాలలో 1999– 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులంతా కలిసి సోమవారం.. బాధిత కుటుంబానికి రూ.72 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శేఖర్, పాండు యాదవ్, బాలరాజ్, శ్రీశైలం, యాదగిరి, జంగయ్య, మొగులయ్య, షకీల్, జగదీష్, పాండు, సుదర్శన్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, నర్సింహ, రవి, సంతోష్‌రెడ్డి, శ్రీను, అంజయ్య, జాను, వెంకటేశ్, నరహరి పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న రాఘవేందర్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్ కాంటినింజెట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతిగృహ ఆవరణలో సోమవారం నిరవధిక సమ్మెను చేపట్టారు. దీనికి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. వర్కర్స్‌ను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. నెలల తరబడి వారి వేతనాలు పెండింగ్‌లో ఉంచడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం.. జీతాలు చెల్లించేలా ట్రెజరీలకు మార్గదర్శకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వర్కర్ స్థానంలో వారి కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వారంతపు సెలవులు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, కుమార్, వెంకట్‌రెడ్డి, మహేందర్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పంబుక్ల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీలో జోరుగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయన్నారు. అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బొంగ్లూర్‌లోని మారం హోమ్స్‌కు వెళ్లే దారిలో పలు నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఔటర్ సర్వీస్ రోడ్డుకు సెట్‌బ్యాక్‌లు లేకుండా సెల్లార్ ఏర్పాటు చేస్తున్నారని, వాటికి అనమతి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

సర్కారు లక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యం

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం వనమహోత్సవం పేరిట అడవులు, పచ్చదనం పెంపకానికి రూ.లక్షలు, కోట్లు వెచ్చిస్తోంది. మొక్కలు నాటిస్తోంది. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వలన నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. లక్ష్యం నీరుగారుతోంది.

- పచ్చదనం పేరిట.. ప్రజాధనం వృథా
- అవగాహన లేమితో తూతూమంత్రంగా వనమహోత్సవం
- రహదారి విస్తరణ స్థలంలో మొక్కలు నాటిన వైనం



విస్తరణ చేపట్టే తొర్రూర్- ఇంజాపూర్ రోడ్డు పక్కన మొక్కలు నాటిన సిబ్బంది

హయత్‌నగర్: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేయాల్సిన అధికారులు.. ఎలాంటి ముందు చూపు లేకుండా విచ్చల విడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. భవిష్యత్తులో పెరిగి పెద్ద అయ్యే మొక్కలను ఎక్కడ నాటాలో అవగాహన లేక ప్రజాధనం వృథా చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. దీనికోసం మొక్కకు సుమారు రూ.400 ఖర్చు చేస్తున్నారు. సంరక్షణ ఖర్చులు అదనం. ఇంత వెచ్చించినప్పటికీ.. మొక్క ఎక్కడ నాటాలి, దాని భవిష్యత్తు ఏమిటని ఆలోచించకుండా ఖాళీ స్థలం కనపడితే చాలు మొక్కలు నాటేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

విమర్శలు వచ్చినా..

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడా– తొర్రూర్– ఇంజాపూర్ రోడ్లను వెడల్పు చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అధికారులు అందుకు అయ్యే ఖర్చును కూడా అంచనాలు వేశారు. ఈ రోడ్లను 100 ఫీట్ల వెడల్పు చేసి, నాలుగు లేన్ల రోడ్డును వేస్తామని ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేశారు. అయినా ఇవేమి పట్టించుకోకుండా.. ఆయా రోడ్ల పక్కన మొక్కలు నాటేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు గుంతలు తీయించారు. రోడ్డు వెడల్పు చేసే ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించడంపై విమర్శలు వచ్చినా అవేమీ పట్టించుకోకుండా మొక్కలు నాటారు. త్వరలోనే రోడ్డు విస్తరణ జరిగే ప్రాంతంలో మొక్కలను నాటడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు తీగల కింద..

మొక్కలను కరెంటు తీగలు, మహా వృక్షాల కింద నాటుతుండడంతో స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారు నాటే మొక్కలు పెరిగే అవకాశం లేకపోవడంతో పచ్చదనం పేరుతో ప్రజాధనాన్ని ఇలా వృథా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మొక్కలు ఎక్కడ నాటాలో.. ఎక్కడ వద్దో సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

> **పనులు నిలిపేశాం**
>
> రహదారి విస్తరణ జరిగే ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీశారు. దీనిపై విమర్శలు వచ్చాయి. దాంతో అక్కడ మొక్కలను నాటే పనులు నిలిపి వేశాం. పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా.. సరైన స్థలంలోనే వనమహోత్సవాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేస్తాం.
>
> –భారతి, ఫారెస్ట్ అధికారి, హెచ్‌ఎండీఏ

మాట తప్పిన ప్రభుత్వం

- హామీల అమలులో విఫలం
- వృద్ధుల పింఛన్లను వెంటనే పెంచాలి
- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా



ఆమనగల్లు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమితి నాయకులు

ఆమనగల్లు: పింఛన్లు పెంచుతానని చెప్పిన ప్రభుత్వం.. మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ ఆరోపించారు. అధికారం చేపట్టిన వెంటనే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు పెంచుతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. పీఠం ఎక్కి రెండేళ్లు కావస్తున్నా.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని పేర్కొన్నారు. హామీల అమలులో పూర్తిగా విఫలం అయిందన్నారు. సమితి పిలుపు మేరకు పట్టణంలో తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆసరా పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం.. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ పెంచి ఇవ్వాలని కోరారు. అదే విధంగా అర్హులైన వారందరికీ ఆసరా మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం డీటీ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి మండల ప్రధాన కార్యదర్శి రాకేశ్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సోషల్ మీడియా కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు ఒగ్గ రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: డీటీ కీర్తిసాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

రూ.6 వేలకు పెంచాలి

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పింఛన్‌దారులతో కలిసి తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికుల ఆసరాను పెంచాలని పేర్కొన్నారు. నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల నాయకులు వెంకటేశ్, అనురాధ, వెంకటేశ్, సత్యం, మంజుల, నర్సింహ, సిద్ధూ, భద్రమ్మ, మంజుల పాల్గొన్నారు.



కడ్తాల్: తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పింఛన్ దారులు

యాచారంలో..

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా సమితి మండల అధ్యక్షుడు మూలీ మహేశ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఉప తహసీల్దార్ కీర్తి సాగర్‌కు అందజేశారు. ఆయా సమితీల నాయకులు యాచారం జంగయ్య, మంద లింగం, ఈశ్వర్, సలీం, కొండల్, పోశయ్య పాల్గొన్నారు.

మోసం చేసిన ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ ఆరోపించారు. మాట నిలుపుకోకుండా మోసం చేసిందని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు సోమవారం పట్నం తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీ మేరకు వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కొత్త వారికి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు జి. సతీష్‌మాదిగ, వి.బాబు, కంబాలపల్లి సురేందర్, పి.నరేందర్, బి.నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సమితి నాయకులు